

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	209	238
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.144	209	238

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 20.0



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్ లో ప్రతిష్ఠించిన 18 అడుగుల హనుమాన్ ఏకశిల విగ్రహం

అభయమివ్వు.. ఆంజనేయ

అట్టహాసంగా ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో 18 అడుగుల ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని కన్నులారా వీక్షించి పరవశించారు. •7లో..



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఉపాధికి దూరం చేసిన ఆధార్



ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు డబ్బు చెల్లింపునకు జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీసు ఖాతా అనుసంధానం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పలువురు కూలీలు పనులకు దూరమవుతున్నారు. ఆధార్ అనుసంధానం కాకపోవడమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఆధార్ అప్‌డేట్ అనుసంధానం సకాలంలో జరగకపోవడంతో తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 52వేల మంది కూలీలు పనికి దూరమయ్యారు.

- మోత్కూరు

ఉపాధి హామీ పనులు 2021 డిసెంబరు వరకు ప్రభుత్వ ఆధీనంలోని 'రాగా' సాఫ్ట్‌వేర్ పర్యవేక్షణలో సాగాయి. ఈ సాఫ్ట్‌వేర్‌తో కేంద్రం నుంచి విడుదలైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి ఇతర పనులకు వినియోగిస్తోంద ని కేంద్ర ప్రభుత్వం భావించింది. క్షేత్రస్థాయిలో పనులు జరగకున్నా ఉద్యోగులు తప్పుడు రికార్డులు నమోదు చేసి కూలీల పేరుతో డబ్బు స్వాహా చేసిన ఘటనలు కొన్ని చోట్ల సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి 'రాగా'కు బదులు నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌పీసీఐ) సాఫ్ట్‌వేర్ తెచ్చి ఉపాధి పనుల అజమాయిషీని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. కూలీలు ఎలాంటి పనులు చేయాలన్నా తొలుత పనిచేస్తున్న ప్రాంతాన్నికూలీల హాజరు,చేసిన పనుల కొలతలను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి నేరుగా ఎన్‌పీసీఐకి పంపేలా పర్యవేక్షణ పెంచారు.

బ్యాంకు లేదా పోస్టాఫీస్ ద్వారానే చెల్లింపులు

అక్రమాలకు ఆస్కారం లేకుం డా కూలీలకు ప్రతీవారం చెల్లించాల్సిన కూలి (వేతనం) బ్యాంకు లేదా పోస్టాఫీసు ద్వారా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు కూలీల ఆధార్ నంబర్, బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా నంబర్, జాబ్‌కార్డుకు అనుసంధా నం చేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థలను ఆదేశించింది. తొలుత గత ఏడాది ఆగస్టు నెల వరకు గడువు విధించి, ఆ తరువాత గత డిసెంబరు 31 వరకు పొడిగించింది. అయినా ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, జాబ్‌కార్డులో, ఆధార్ ఇంటి పేర్లు సరిపోలకపోవడం, వేలి ముద్రలు నమోదుకాకపోవడం, కొత్తగా పెళ్లయిన వారికి వధువు ఆధార్‌కార్డు ఆమె తల్లిదండ్రుల రేషన్‌కార్డుకు లింకై ఉండటం తదితర కారణాలతో కొందరు కూలీల ఆధార్ అనుసంధానం పూర్తి కాలేదు. దీంతో ఆధార్ అనుసంధానం కాని కూలీలను ఉపాధి సిబ్బంది పనికి రానివ్వడం లేదు.

గ్రూపులు లేకపోవడంతో...

గతంలో పని చేస్తున్న కూలీలను 20మందికి ఒక గ్రూపుగా విభజించి పని చేయించేవారు. ఒక్కో గ్రూ పునకు ఒక మస్టర్ ఉండేది. ఇప్పుడు ఒక చోట ఎం తమంది (100-150మంది) పనిచేసినా ఒకే గ్రూపు గా పరిగణించి, ఒకే మస్టర్ రాస్తున్నారు. అక్కడ పని చేసే కూలీల్లో ఒక్కరి ఆధార్ అనుసంధానం కాకపోయినా మిగతా కూలీలందరి వేతనం నిలిచిపోతుంది. ఈ కారణంగా ఆధార్ అనుసంధానం చేయని కూలీలను పనిలోకి రానివ్వడం లేదు.

ప్రోత్సాహకాలు రద్దు

ఉపాధి హామీ పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనం లో నడిచినప్పుడు వేసవిలో పని కష్టమని ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం అదనంగా కూలి ఇచ్చేవారు. లీటర్ నీటికి రూ.2చొప్పున రోజుకు ఐదు లీటర్ల తాగునీటికి రూ.10, గడ్డపార మొన పెట్టించేందుకు రూ.10, మేట్లకు రూ.20 అలవెన్సుగా ఇచ్చేవారు. నీడ కోసం టెంట్లు వేసేవారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని అవన్నీ రద్దుచేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లెక్కల ప్రకారం పని చేస్తే కూలీకి ప్రతి రోజు రూ.272 ప్రభుత్వం చెల్లిస్తుంది. గతంలో యాదాద్రి జిల్లాలో సగటు కూలి రూ.110 కాగా, ఇప్పుడు సగటు కూలి రూ.180గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

నీడలేదు, నీళ్లు లేవు



పనిచేసే చోట గతంలో నీడ కోసం టెంట్లు వేసేవారు. ఇప్పుడు టెంట్లు వేయడం లేదు. ఎండలో పని చేసి అలిసిపోతే కొంత సేపు సేదదీరుదామంటే నీడ ఉండటం లేదు. చెట్లు లేని చోట నీడ లేక ఎండలోనే కూర్చోవల్సి వస్తోంది. గతంలో తాగునీటికి రోజుకు రూ.10చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఫిల్టర్‌నీళ్లు మాడబ్బుతోనే కొనుగోలుచేసి తాగుతున్నాం. గతంలో మాదిరిగా తాగునీటికి డబ్బు ఇవ్వాలి.

- చంద్రమ్మ, ఉపాధి కూలీ, ముశిపట్ల

పేస్లిప్‌లు ఇవ్వడం లేదు



గతంలో పేసిప్ ఇచ్చేవారు. వాటితో ఏ రోజు ఎంత కూలి వచ్చిందనేది తెలిసేది. ఇప్పుడు పేస్లిప్ ఇవ్వడం లేదు. రెండు, మూడు వారాలకు కలిపి కూలి మొత్తం ఒకే సారి ఖాతాలో వేస్తుండటంతో ఏ రోజు ఎంత కూలి పడిందన్నది తెలియడం లేదు. గడ్డపార మొన పెట్టించడానికి డబ్బు ఇవ్వకపోవడంతో వచ్చే కూలి నుంచే రోజుకు రూ.10నుంచి రూ.15 గడ్డపార మొన పెట్టించేందుకే ఖర్చవుతోంది. పేస్లిప్‌లు ఇవ్వడంతో పాటు గడ్డపార మొన పెట్టించడానికి గతంలా డబ్బు ఇవ్వాలి. వేసవిలో భూమి గట్టిగా ఉండి తవ్వకం పనులు ఎక్కువ జరగవు. కాబట్టి వేసవిలో అదనపు కూలి ఇవ్వాలి.

- బుషిపాక హనుమయ్య, కూలీ, ముశిపట్ల

ఉమ్మడి జిల్లాలో 52,405 మంది దూరం

వివిధ కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం కాక 52,405 మంది పనికి దూరమయ్యారు. నల్లగొండ జిల్లాలో 7,61,615 మంది కూలీలు, సూర్యాపేట జిల్లాలో 5,74,401 మంది, యాదాద్రి జిల్లాలో 2,60,913 మంది కూలీలు ఉన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో నల్లగొండ జిల్లాలో 25,299 మంది, సూర్యాపేట జిల్లాలో 19,226 మంది, యాదాద్రి జిల్లాలో 7,880 మంది కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ కార్డులు అనుసంధానం జరగక పనులకు దూరమయ్యారు. వ్యవసాయ పనులు ముగిసినందున ప్రస్తుతం కూలీలకు ఉపాధి హామీ (కరువు)పనులే ఆదాయ వనరు. ఆధార్ అనుసంధానం జరగక పనిలోకి రానివ్వకపోవడంతో తాము ఉపాధి కోల్పోయామని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, ఇది నిరంతర ప్రక్రియ అని, ఆధార్ అప్‌డేట్ చేయించుకుని జాబ్‌కార్డుకు లింక్ చేయించుకున్నట్టయితే వెంటనే పనిలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

సరిహద్దులో తనిఖీలేవీ?

- ఆంధ్రప్రదేశ్ నుంచి యథేచ్ఛగా గంజాయి రవాణా
- ద్విచక్రవాహనాలు, కార్లలో తరలింపు
- అధికారులు ఆదేశించినా, తనిఖీలు చేయని పోలీసులు



వాహనాలను తనిఖీ చేయకుండానే నెంబర్లను రిజిస్టర్ చేసుకుంటున్న చెక్‌పోస్టు సిబ్బంది

కోదాడ రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు తూతూ మంత్రంగా చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గతంలో చెక్‌పోస్టు వద్ద ఒక ఎస్‌ఐతో పాటు ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్, ఫారెస్టు సిబ్బంది కూడా విధులు నిర్వహించేవారు. ఇటీవల కాలంలో ఇక్కడ పోలీస్ సిబ్బందిని పూర్తిస్థాయిలో తగ్గించారు. సూర్యాపేటలో వీఆర్‌లో ఉన్న సిబ్బందిని నియమిస్తూ వస్తున్నారు. రెగ్యులర్‌గా ఇక్కడ ఎస్‌ఐ విధులు నిర్వహించడంలేదు. రెండు రోజులకు ఒకసారి, మూడు రోజులకు ఒకసారి ఎస్‌ఐకి డ్యూటీ వేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ఎస్‌ఐ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారం రోజుల క్రితం డీఎస్పీ మేకచెర్యు వెళ్తూ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు డ్యూటీలో లేని విషయాన్ని గమనించారు. వెంటనే ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దఎత్తున గంజాయి తెలంగాణకు సరఫరా అవుతుండడంతో అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. కానీ ఇక్కడి చెక్‌పోస్టు వద్ద అందుకు విరుద్ధంగా జరుగుతోంది. విశాఖపట్నం నుంచి కార్లు, బైకుల మీద ఇటీవల పెద్దఎత్తున గంజాయి తెలంగాణకు తరలుతోంది. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాటిని ఆపి తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది సరిగా తనిఖీలు నిర్వహించడంలేదని ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో వారు రోజుకు సుమారు 100 నుంచి 200 పైగా వాహనాలను తనిఖీ చేసి వాటి రిజిస్ట్రేషన్ నెంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశాలిచ్చారు. కానీ డ్యూటీలో ఉన్న సిబ్బంది చెక్‌పోస్టు వద్ద ఎలాంటి వాహనాలను ఆపి తనిఖీ చేయకుండానే రోడ్డు మీద వెళ్తున్న వాహనాల నెంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలైన మండలంలోని నల్లబండగూడెం, దొరకుంట, రెడ్లకుంట, చిమిర్యాల, మంగల్‌తండాతో పాటు పలు గ్రామాల్లో జగ్గయ్యపేట నుంచి పెద్దఎత్తున గంజాయి చెక్‌పోస్టు మీది గుండానే ఈ గ్రామాలకు సరఫరా అవుతుంది. ఇప్పటికే ఈ గ్రామాల్లో గంజాయి రవాణా కేసులు పెద్దఎత్తున నమోదయ్యాయి. ఇప్పటికైనా చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఖోఖో మహిళల విజేత మనోళ్లే



ఖోఖో మహిళా విజేత ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయి 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. మూడు రోజులుగా జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. •6లో..

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

తుంగతుర్తి, ఫిబ్రవరి 11: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు తుంగతుర్తిలో 790 మంది విద్యార్థులు హాజరైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలత నీలా రాణి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు గిరిజన గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 384 మంది విద్యార్థులకు 347 మంది, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 480 మంది విద్యార్థులకు 443 విద్యార్థులు హాజరయ్యారని, మొత్తంగా 74 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్ర కబడ్డీ పోటీలకు 40మంది బాల, బాలికలను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, నామా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలో రాష్ట్ర కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అండర్-16 బాలబాలికల ఎంపిక పోటీలకు 150 మంది బాలురు, 70 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు. చింతలపాలెం మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తుండగా, జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి హుజూర్‌నగర్‌లో నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చి, రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. సమావేశంలో రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మస్తాన్, సునీల్, ప్రదీప్, అలీపాషా పాల్గొన్నారు.

ముగిసిన కవితా యాత్ర

నడిగూడెం, ఫిబ్రవరి 11: నడిగూడెం రాజావారికోటలో డాక్రి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా యాత్ర ఆదివారం ముగిసింది. కోదాడ నుంచి కొమరబండ, ఆకుపాముల, ముకుందాపురం, నడిగూడెం మీదుగా కవితా యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో కవులు రచించిన గ్రంథాలు, పుస్తకాలను ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 60మంది కవులు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు యాత్ర చేపట్టారు. సిలివేరు సాహితీ సేవ కళాపీఠం అధ్యక్షుడు లింగమూర్తి, బి.హరికృష్ణ, వెంకటస్వామి నాయుడు, కారం శంకర్, రచయితల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి ఎస్ఎస్‌రావు, బి.వెంకట్‌తోపాటు రెండు రాష్ట్రాలకు చెందిన 60 మంది కవులు హాజరయ్యారు. కార్యక్రమంలో అలోరి విల్సన్,డి.నర్సింహ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 55మంది ఎంపీడీవోల బదిలీ

● పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం

నల్లగొండ, సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎంపీడీవోలు ఈనెల 13లోగా వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 55మంది ఎంపీడీవోలకు స్థానచలనం కలిగింది. నల్లగొండ జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 14మంది, సూర్యాపేట జిల్లాలో 13మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు.

ఎంపీడీవో	బదిలీ జిల్లా
నల్లగొండ జిల్లాలో..	
బి.యాకుబ్	యాదాద్రి
కే.రమేష్‌దీన్‌దయాళ్	సూర్యాపేట
పి.జాన్సీలక్ష్మిబాయి	యాదాద్రి
బి.లాజర్	సూర్యాపేట
పీవీఎస్‌ఆర్‌కే శర్మ	సిద్దిపేట
డి.జితేందర్‌రెడ్డి	యాదాద్రి
ఖాజా అజ్‌ఘర్ అలీ	సూర్యాపేట
కె.శేషుకుమార్	సూర్యాపేట
జి.లక్ష్మి	సూర్యాపేట
పి.సునీత	సూర్యాపేట
జె.రాములునాయక్	జోగులాంబగద్వాల్
కె.గిరిబాబు	సూర్యాపేట
కె.ప్రమోద్‌కుమార్	యాదాద్రి
ఎ.దేవిక	యాదాద్రి
జె.వెంకటేశ్వర్‌రావు	సూర్యాపేట
జి.బాలకృష్ణ	సూర్యాపేట
వై.శ్రీనివాస్‌రెడ్డి	యాదాద్రి
డి.సోమసుందర్‌రెడ్డి	సూర్యాపేట
వై.హరికృష్ణ	జోగులాంబగద్వాల్
పి.మహేందర్‌రెడ్డి	సంగారెడ్డి
ఎంఎం.షరీఫ్	సంగారెడ్డి
ఎల్.రాజు	ఖమ్మం
ఎస్.సుధాకర్	సంగారెడ్డి
జి.యాదగిరి	సంగారెడ్డి
ఆర్.బాస్కర్	యాదాద్రి
సూర్యాపేట జిల్లాలో..	
ఆర్.సరోజ	నల్లగొండ
ఎం.ఎర్రయ్య	ఖమ్మం
ఎండీ.ఇసాక్‌హుస్సేన్	నాగర్‌కర్నూల్
బీ.శ్రీనివాసరావు	నల్లగొండ
పి.శంకరయ్య	యాదాద్రి
కె.ఉమేష్‌చారి	నల్లగొండ
ఎం. ఇందిర	యాదాద్రి
ఎల్.మల్‌సూర్	సంగారెడ్డి
ఎ.జానయ్య	నారాయణపేట్
కె.ఇద్దయ్య	భద్రాద్రికొత్తగూడెం
ఎల్.లక్ష్మి	నల్లగొండ
బి.వెంకటేశ్వర్లు	ఖమ్మం
టి.వెంకటాచారి	వనపర్తి
యాదాద్రి జిల్లాలో..	
పి.జ్ఞానప్రకాష్‌రావు	నల్లగొండ
ఈ.వీరస్వామి	మహబూబాబాద్
ఎల్.చంద్రమౌళి	నల్లగొండ
లెంకల గీతారెడ్డి	మేడ్చల్‌మల్కాజ్‌గిరి
కె.ప్రభాకర్‌రెడ్డి	వికారాబాద్
ఎ.రాములు	జనగాం
యు.శ్రీవాణి	రంగారెడ్డి
ఎ.బాలశంకర్	రంగారెడ్డి
బి.సరిత	రంగారెడ్డి
జి.జలేందర్‌రెడ్డి	జనగాం
ఉమాదేవి	జనగాం
బి.యాదగిరి	సిద్దిపేట
జి.శ్రీనివాసులు	జనగాం
జి.నరేందర్‌రెడ్డి	రంగారెడ్డి

బీమా పేరుతో ఘరానా మోసం

» వందల మంది నుంచి రూ.30 కోట్లపైనే వసూళ్లు » పోలీస్‌స్టేషన్‌లో బాధితులు » కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11: ప్రైవేట్ బీమా పేరుతో ఇద్దరు వ్యక్తులు పలువురిని మోసం చేశారు. ఒకరు కాదు ఇద్దరు కాదు వందల మంది అమాయకులనుంచి కోట్ల రూపాయలు వసూలు చేశారు. అర్థరాత్రివేళ ఇల్లు ఖాళీ చేసి పారిపోతున్న నిందితులను అనుచరులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితులు ఖమ్మం జిల్లా బుద్ధారానికి చెందిన మేళ్లచెరువు జ్యోతి, కోదాడ మండలం గణపవరానికి చెందిన సూరేపల్లి సత్యనారాయణ, కొమరబండకు చెందిన దేవపంగు రమాదేవి, మిర్యాలగూడ మండలానికి చెందిన ధూళిపాళ సంపత్‌కుమార్, హుజూర్‌నగర్ మండలం మాధవరాయనిగూడేనికి చెందిన చప్పిడి వీరబాబులు తెలిపిన వివరాల ప్రకారం..

ప్రైవేట్ బీమా కంపెనీలో పనిచేస్తున్నామని..

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మాధవరాయనిగూడెం స్టేజీ వద్ద నివాసం ఉంటున్న గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన కందుల వినయ్, పుల్లెంల అనిల్ 2021 సెప్టెంబరు నుంచి తాము ప్రైవేట్ బీమా కంపెనీ 'టీలైఫ్'లో పనిచేస్తున్నామని నమ్మించారు. రూ.లక్ష కడితే రూ.11లక్షలు, రూ.5లక్షలు కడితే రూ.30లక్షలు బీమా వస్తుందని నమ్మబలికారు. ఇలా హుజూర్‌నగర్, మేళ్లచెరువు, గరిడేపల్లి, కోదాడ, ఖమ్మం, సూర్యాపేట ప్రాంతాల్లోని సుమారు 500 మంది నుంచి బీమా పేరుతో రూ.లక్షలు వసూలు చేశారు. మాధవరాయగూడేనికి చెందిన చప్పిడి వీరబాబు అనే బాధితుడు, అతని స్నేహితులు సంకాల శ్రీను, పాల్వాయి నాగరాజు, కంచర్ల మహేంద్ర, పాలడుగు రవి, పాశం సతీష్‌రెడ్డిలతోపాటు స్నేహితులు సుమారు రూ.32లక్షలు చెల్లించారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా బుద్ధారానికి చెందిన మేళ్లచెరువు జ్యోతితోపాటు తమ బంధువులు 20 మంది నుంచి సుమారు రూ.36 లక్షలు బీమా కింద చెల్లించారు. మిర్యాలగూడకు చెందిన ధూళిపాళ సంపత్‌కుమార్ తోపాటు తన కుటుంబ సభ్యులు రూ.8లక్షలు చెల్లించారు. కోదాడ మండలం గణపవరానికి చెందిన సూరేపల్లి సత్యనారాయణ రూ.15లక్షలు కట్టించారు. 2021 సెప్టెంబరు నుంచి పలువురు కందుల వినయ్, పుల్లెంల అనిల్‌కు డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో డబ్బులు చెల్లించిన మూడు నెలల తర్వాత బాండ్లు కావాలని బాధితులు అడిగారు. వారిని సంవత్సర కాలంపాటు రేపు మాపు అంటూ మోసం చేశారు. తీరా డబ్బులు కట్టిన వారు ఒత్తిడి చేయడంతో కొంతమందికి ప్రామీసరీ నోట్లు, మరికొంతమందికి ఖాళీ చెక్కులపై సంతకాలు చేసి ఇచ్చారు. అయినప్పటికీ వినయ్, అనిల్‌లు డబ్బులు చెల్లించడంలేదు. సుమారు 500 మంది దగ్గర సుమారు రూ.30కోట్లకుపైగా బీమా పేరుతో వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారంరాత్రి హుజూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న కందుల వినయ్ ఇంటి నుంచి తన అనుచరులు మామిడి కార్తీక్‌తోపాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిని ఖాళీ చేసేందుకు వస్తువులను వాహనంలోకి ఎక్కిస్తుండగా బాధితుడైన హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని మాధవరాయనిగూడేనికి చెందిన చప్పిడి వీరబాబు 100కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు వచ్చి వాహనాన్ని ఆపి, కార్తీక్, మరో ఇద్దరు వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వీరబాబు తెలిపారు. కాగా వీరబాబు మాట్లాడుతూ తన స్నేహితుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి వినయ్, అనిల్‌లకు ఇచ్చానని ఆవేదన వ్యక్తంచేశారు. వినయ్, అనిల్ మోసాన్ని గమనించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం



జీవిత బీమా పేరుతో వినయ్, అనిల్‌లు కొంతమందిని మోసం చేసినట్లు మాకు ఫిర్యాదు వచ్చింది. ఈ నెల 10వ తేదీన కొత్తగా బాధ్యతలు స్వీకరించా. దీనిపై పూర్తి విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తా.

- ముత్తయ్య, ఎస్ఐ, హుజూర్‌నగర్

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

● *నిత్య ఆదాయం రూ.53.48లక్షలు*

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మేడారం జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరీశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ. సుముహూర్తాలు ఆరంభమవగా, క్షేత్రాన్ని సందర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ప్రధానాలయం, తిరువీధులు, సేవామండపాలు సందడిగా కన్పించాయి. ధర్మదర్శనాల్లో మూడు గంటలు, ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 45వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య విధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో, శివాలయంలో రామలింగేశ్వరుడికి స్మార్త సంప్రదాయరీతిలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు బిందెతీర్థంతో నిత్య పూజలు ఆరంభించి రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవంతో ఆలయ ద్వార బంధనం చేశారు. స్వామి వారికి అమెరికాకు చెందిన చెరుకూరి శైలేంద్ర, రాధిక దంపతులు సుమారు 990గ్రాముల బరువు ఉన్న రెండు వెండి కలశాలను కానుకగా అందజేశారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులకు హైదరాబాద్ ఏఎస్.రావ్‌నగర్‌కు చెందిన ఎస్.ల్యాబ్స్ క్రిష్‌మెడ్స్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భక్తులు పరీక్షలు చేయించుకున్నారు. కాగా, వివిధ విభాగాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.53,48,668 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.



నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఖోఖో మహిళల విజేత

ఉమ్మడి నల్లగొండ జట్టు

● *ముగిసిన 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు*



ఫైనల్స్‌లో పోటీ పడుతున్న నల్లగొండ, రంగారెడ్డి జట్లు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. ఈ మేరకు మూడు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలు ఆదివారం ముగిశాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్స్‌లో నల్లగొండ జట్టు రంగారెడ్డి జిల్లాపై 9-7పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, హైదరాబాద్ జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. పురుషుల ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రంగారెడ్డి జిల్లాపై 22-21 పాయింట్ల తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. తృతీయ, చతుర్థ స్థానంకోసం జరిగిన పోటీలో వరంగల్, హైదరాబాద్ జట్ల మ్యాచ్ టై కావడంతో ఆ రెండు జట్లను తృతీయ స్థానాన్ని సమష్టిగా పంచుకున్నాయి. నల్లగొండ పురుషుల జట్టు 9వ స్థానంలో నిలిచింది. మహిళా జట్టు విజేతకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పురుషుల జట్టు విజేతకు అదనపు కలెక్టర్ వీరారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో క్రీడా సౌకర్యాలను మెరుగుపర్చే లక్ష్యంతో పట్టణ శివారులోని రాయిగిరిలో 10ఎకరాల విస్తీర్ణంలో రూ.100కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఛాంపియన్ షిప్ పోటీలు

56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళల, పురుషుల జట్లకు చెందిన 300 మంది క్రీడాకారులు 48 మ్యాచ్‌లు ఆడారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి కె ధనంజనేయులు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనాథ్, టోర్నీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, డీఏవో మందడి ఉపేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జలేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ బాబు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ ఉన్నారు.

టోర్నీలో జట్ల స్థానాలు ఇలా..

మహిళల జట్టు:నల్లగొండ(1వ), రంగారెడ్డి(2వ), మహబూబ్‌నగర్ (3వ), హైదరాబాద్ (4వ), ఆదిలాబాద్ (5వ), కరీంనగర్ (6వ), మెదక్ (7వ), వరంగల్ (8వ), ఖమ్మం (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.

పురుషుల జట్టు : కరీంనగర్ (1వ), రంగారెడ్డి (2వ), వరంగల్, హైదరాబాద్ (సంయుక్తంగా 3వ), మెదక్ (5వ), ఖమ్మం (6వ), మహబూబ్‌నగర్ (7వ), ఆదిలాబాద్ (8వ), నల్లగొండ (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.



కరీంనగర్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

చాక్లెట్లు ఆశ చూపి చిన్నారికి బెదిరింపులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం ఓ చిన్నారికి చాక్లెట్లు ఆశచూపి బెదిరించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి సాయంత్రం 4గంటల తర్వాత పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా ఓ అగంతకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి చాక్లెట్ ఇస్తా అని చెప్పడంతో చిన్నారి తీసుకోకుండా మొండికేసింది. ఎందుకు తీసుకోవు అంటూ బెదిరిస్తుండడంతో చిన్నారికి భయం వేసి రహదారి పక్కన ఉన్న ఇంట్లోకి పరిగెత్తింది. ఆ ఇంట్లో ఉన్న వారికి విషయం చెప్పడంతో వారు బయటకు వచ్చే సరికి అగంతకుడు ఉడాయించాడు. బైక్‌పై వచ్చిన వ్యక్తి టీషర్ట్ ధరించి, నిక్కరు వేసుకొని ఉన్నాడని చిన్నారి తెలిపింది. పోలీ‌స్‌స్టేషన్‌కు అతి సమీపంలో జరిగిన ఈ ఘటనతో అంతా ఉలిక్కిపడ్డారు. చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు తెలిపారు. పై విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

కన్నుల పండువగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 11: జై శ్రీరామ్.. జై హనుమాన్ భక్తుల నినాదాలు.. హర్షధ్వానాల నడుమ 18అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. జిల్లా కేంద్రంలోని పాత బస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయం ప్రారంభం, స్వామివారి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ చూడముచ్చటగా సాగింది. ఉదయం రుత్వికుల వేదమంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు యంత్ర ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని కనులారా తిలకించి పరవశులయ్యారు. అనంతరం అర్చక స్వాములు సువర్చల సమేత అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరు రాజయ్య, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, సతీష్, గార్లపాటి వెంకటయ్య, కంది సూర్యనారాయణ, రాంరెడ్డి, యాదగిరి, అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, చాడా కిషన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందువుల ఆకాంక్ష నెరవేరింది : కిషన్‌రెడ్డి

పలు పోరాటాల అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో హిందువుల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయం, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అంజనేయస్వామి దేవాలయం ఒక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజయ్య, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, గుండబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.25లక్షలు : వెంకట్‌రెడ్డి

విగ్రహదాతగా ఉండటం తన అదృష్టమని, ఆలయ అభివృద్ధికి మరో రూ.25లక్షలు కేటాయిస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ హరిచందనతో కలిసి పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయానికి వచ్చేభక్తులకు ఇబ్బంది కలగకుండా ఘాట్ రోడ్ నిర్మాణం, గాలిగోపురం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవి, గుమ్మల మోహన్ రెడ్డి, అబ్బగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న భక్తులు



స్వామివారికి మొక్కుతున్న భక్తులు





స్వామివారికి మొక్కుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వారం రోజుల్లో వివాహం..

అంతలోనే విషాదం

శుభలేఖలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి



శివకుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి, మోత్కూరు, ఫిబ్రవరి 11: వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. శనివారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన సకినాల వెంకటయ్య, ఉమారాణి దంపతులకు రైస్‌మిల్లు, కిరాణా దుకాణం ఉన్నాయి. ముగ్గురు కుమారులు కాగా, ఇద్దరికి వివాహాలు అయ్యాయి. వెంకటయ్య కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా, కుమారులు రైస్ మిల్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. మూడో కుమారుడు శివకుమార్(26)కు హైదరాబాద్‌కు చెందిన అమ్మాయితో ఈ నెల 18వ తేదీన వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో హడావుడిగా ఉన్నారు. వరుసకు సోదరుడైన అప్పిశెట్టి నితిన్‌కుమార్‌తో కలిసి శివకుమార్ పెళ్లి పత్రికలను పంచుతున్నాడు. శనివారం నల్లగొండలో ఉంటున్న బంధువులకు పత్రికలు పంచి ద్విచక్ర వాహనంపై తిరిగి మోత్కూరు కు బయలుదేదారు. రాత్రి 11 గంటల సమయంలో నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామశివారుకు చేరుకోగానే ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శివకుమార్ తలకు బలమైన గాయాలుకాగా, వెనుక కూర్చున్న నితిన్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శివకుమార్‌కు ప్రాథమిక చికిత్స అందించి నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. శివ సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

మోత్కూరులో విషాదఛాయలు

మోత్కూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కిరాణ వ్యాపారులు దుకాణాలు మూసి వేసి సంతాపం తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శివకుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న, మొగుళ్లపల్లి సోమయ్య, బుక్క విశ్వనాథం, బుస్సా శ్రీనివాస్, సోమ వెంకటేశ్వర్లు, తిపిరిశెట్టి శ్రీనివాస్, బుస్సా రవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ఆస్తి పంచాయితీలో దుర్భాషలాడిన తండ్రి

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 11: పుట్టింటి వారు పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఇంటి స్థలం కోసం ఓ మహిళ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఈ సంఘటన జరిగింది. బాధిత మహిళ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన కదారి రామనర్సయ్యకు ఇద్దరు భార్యలు ఉన్నారు. 11 సంవత్సరాల క్రితం మొదటి భార్య కుమార్తె విజయకు వివాహం సమయంలో పసుపుకుంకుమల కింద గ్రామంలో ఉన్న ఇంటిని అప్పగించాడు. అయితే తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన ఇంటిని తండ్రి రామనర్సయ్య ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుమార్తె విజయ దీనిని అడ్డుకుని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు గ్రామ పెద్ద మనుషులను ఆశ్రయించింది. ఎక్కడా తనకు న్యాయం జరగలేదని బాధితురాలు విజయ తెలిపింది. అయితే గత నెల 28వ తేదీన తన ఇంటి విక్రయంలో తన కుమార్తె విజయ అడ్డుపడుతుందని తండ్రి రామనర్సయ్య మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించేందుకు రూరల్ పోలీసులు విజయను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ తీర్మానం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ షెడ్‌లో పంచాయితీ నిర్వహించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగగా విజయ తన తండ్రిని ఆస్తి విషయమై నిలదీసింది. మనస్తాపం చెందిన విజయ బ్లేడ్‌తో చేతి మణికట్టు వద్ద గాయం చేసుకుంది. దీంతో చేతి నరాలు తెగి తీవ్ర రక్తస్రావమవుతుండటంతో పోలీస్‌స్టేషన్‌లోకి పరుగున వెళ్లింది. దీనిని గమనించిన ఎస్‌ఐ సతీష్ ఆమెను చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం చేతి స్పర్శ లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పదేళ్లుగా పుట్టింటి వారినుంచి వచ్చిన ఆస్తి కోసం పోరాడుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదని, తనకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించి పసుపు కుంకుమల కింద అప్పగించిన ఆస్తి దక్కేలా అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విజయ కోరుతుంది. సంఘటన జరిగిన ప్రదేశం వన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో దీనిపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు విజయ

'ఆరు గ్యారెంటీలు' కంటే విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వండి

ఇమాంపేటలో విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 11: ఎన్నికల్లో గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన ఆరు గ్యారెంటీల కంటే రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గ్రామ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వైష్ణవి మృతికి రీజనల్ కోఆర్డినేటర్(ఆర్సీవో), ప్రిన్సిపాల్ కారణమంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల హామీలు అమలుచేయకపోయినా వచ్చే నష్టమేమీలేదని, ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థినుల ప్రాణాలను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనను మరవక ముందే సూర్యాపేటలో విద్యార్థిని మృతిచెందడం బాధాకరమన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చింది ఇందుకేనా? అని మండిపడ్డారు. ఆదాయం వచ్చే శాఖలకు మంత్రులను కేటాయించారని, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. భువనగిరి గురుకులంలో విద్యార్థినులు మృతి చెందితే ప్రభుత్వం రెండు నిముషాలు మౌనం పాటించకపోవడం హేయమైన చర్య అని అన్నారు. ఇమాంపేట గురుకులంలో విద్యార్థిని చనిపోతే తల్లిదండ్రులకు భరోసా కల్పించడానికి మంత్రి, ఎమ్మెల్యే, సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు రాకపోవడం సిగ్గుమాలిన చర్యకు పరాకాష్ఠ అని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు, పాలపక్షాలు పరస్పరం తిట్టుకుంటున్నాయని, ఒకరు శ్వేత పత్రం అంటారని, మరొకరు నల్లపత్రం అంటారని, పిల్లల జీవితాల గురించి పట్టించుకునే నాథుడేలేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థినులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గురుకులంలో విద్యార్థినుల మనోభావాలను అర్థం చేసుకోవడానికి సైకాలజిస్టు, కౌన్సిలర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. వైష్ణవి మృతిపై ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులను సస్పెండ్ చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాల ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

గంజాయి విక్రేతల అరెస్ట్

సుమారు 2.4 కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 11: నిషేధిత గంజాయిని పీల్చుతూ, ఇతరులకు విక్రయిస్తున్న యువకులను సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు చిలుకూరు పోలీసులు మండల పరిధిలోని బేతవోలు గ్రామశివారులోగల మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ఐదుగురు యువకులు గంజాయిని తాగుతూ ఉన్నారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే బోడ సురేష్, అదే గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బానోత్ మోహన్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే భూక్యా అఖిల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు తండాకు చెందిన వ్యవసాయ పనులు చేసే ధరావత్ వినోద్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగలితండాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సునావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్‌లు స్నేహితులు. వీరందరు కొంత కాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. దీంతో ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కిలో గంజాయిని రూ.4500 కొనుగోలు చేసి వారు పీల్చడంతోపాటు సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా సునావత్ సాయి అతడి స్నేహితుడైన వినోద్‌కు ఫోన్ చేసి బేతవోలుకు చెందిన శ్రీకాంత్‌కు తమ వద్ద గంజాయిని విక్రయిద్దామని అతడు వారి గ్రామ సమీప ప్రాంతంలో ఇతరులకు విక్రయిస్తాడని చెబుతాడు. దీంతో ఈ నెల 10వ తేదీన బోడ సురేష్, భూక్యా అఖిల్‌కుమార్, బానోత్ మోహన్ ముగ్గురు కలిసి వారి వద్ద ఉన్న సుమారు రెండు కిలోల గంజాయిని తీసుకుని సురేష్ బైక్‌పై వినోద్ వద్దకు వెళ్లి అతడి వద్ద ఉన్న సుమారు 400 గ్రాముల గంజాయిని తీసుకున్నారు. అక్కడి నుంచి నలుగురు కలిసి బేతవోలు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో బోడ సురేష్ బైక్‌పై అఖిల్, బస్సులో మోహన్, వినోద్ మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో బేతవోలు గ్రామ శివారులోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో గల సాయిలి నవీన్ యొక్క మామిడి తోటకు వెళ్లారు. వారు వచ్చిన విషయాన్ని శ్రీకాంత్‌కు తెలపగా శ్రీకాంత్ మామిడితోటకు వెళ్లాడు. అక్కడ ఐదుగురు కలిసి గంజాయి తాగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా వారి వద్ద సుమారు రూ.37వేల విలువైన రెండు కిలోల 400 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తాగుతూ, ఇతరులకు విక్రయిస్తున్న ఆరుగురు యువకులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఐదుగురు యువకులను కోర్టుకు రిమాండ్‌కు తరలించగా సునావత్ సాయి పరారీలో ఉన్నాడు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్, నగేష్, అలీమోద్దిన్ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

నిరుపయోగంగా ప్లాస్టిక్ దుకాణాలు

● రోడ్లపైనే వ్యాపారం ● లక్షల రూపాయలు వృథా



రోడ్లపైనే వ్యాపారం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 11: సూర్యాపేట మునిసిపాలిటీలో వీధి వ్యాపారుల కోసం కేటాయించిన ప్లాస్టిక్ దుకాణాలు నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్లాస్టిక్ దుకాణాలు వీధి వ్యాపారులు వినియోగించనందున ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ప్లాస్టిక్ నిర్మూలనే ధ్యేయంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ దుకాణాలను ఏర్పాటు చేసింది. పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, వీధి వ్యాపారులకు చేయూతనందించడానికి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన దుకాణాలను ఉచితంగా అందించారు. జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో రూ.16లక్షల వ్యయంతో 15 దుకాణాలను ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు కేటాయించారు.

లక్షల నిధులు నిరుపయోగం

జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద గ్రీన్ జోన్ పద్ధతిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో 15దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలకు పైకప్పు, చుట్టూ ప్లాస్టిక్ మిశ్రమంతో కూడిన షీట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి నిప్పు, నీరు, ఆమ్లం వంటి వాటి నుంచి రక్షణ కల్పిస్తాయి. వీటికి ఆధారంగా ఇనుపరాడ్లను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన షీట్లు ఎలాంటి అనారోగ్యానికి గురిచేయవు. ఈ దుకాణాలను 2020సంవత్సరంలో వీధి వ్యాపారులకు ప్రారంభించారు. ఈ 15ప్లాస్టిక్ దుకాణాల వద్దకు కొనుగోలుదారులు కావడంలేదని సాకుతో దుకాణాలకు వ్యాపారులు తాళం వేసి, రోడ్లపైనే యథావిధిగా వ్యాపారం చేస్తున్నారు. దీంతో దుకాణాలు అలంకారప్రాయంగా మారాయి. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని కుడకుడ, ఖమ్మం క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో వీధివ్యాపారుల కోసం రూ.30లక్షల వ్యయంతో 27 ప్రత్యేక షెడ్లను నిర్మించారు. అదేవిధంగా జిల్లాలోని కోదాడ మునిసిపాలిటీలో 9, హుజూర్‌నగర్‌లో 14షెడ్లను నిర్మించారు. వీటిని కూడా వీధి వ్యాపారులు పూర్తి స్థాయిలో వినియోగించడంలేదు. . ముఖ్యంగా జిల్లా కేంద్రంలో నిర్మించిన ప్రత్యేక షెడ్లు నిరుపయోగంగా మారాయి.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

జిల్లా కేంద్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అంతకంత పెరుగుతోంది. ముఖ్యంగా వీధివ్యాపారులు రోడ్లపై వ్యాపారం చేస్తున్నందున ట్రాఫిక్ సమస్య జటిలమైంది.. జిల్లాలోని అర్వపల్లి మండలం కేంద్రంతో పాటు, తుంగతుర్తి, తిరుమలగిరి, సూర్యాపేట జంక్షన్ ప్రాంతంల్లో రోడ్డుపైనే వ్యాపారులు కూరగాయలను విక్రయిస్తున్నందున ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో వాణిజ్యభవన్, శంకర్‌విలాస్ సెంటర్, రాఘవప్లాజాసెంటర్, కొత్త బస్‌స్టేషన్ ప్రాంతం, పాత బస్‌స్టేషన్ ప్రాంతం, పోస్టాఫీస్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది.జిల్లాలోసూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి హుజూర్‌నగర్, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో 11,800మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనధికారికంగా ఎంతోమంది వీధుల్లో వ్యాపారం చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల దుకాణాలు

ప్లాస్టిక్ దుకాణాలు ఉపయోగించుకోవాలి



వీధి వ్యాపారులు తప్పని సరిగా ప్లాస్టిక్ దుకాణాల్లో వ్యాపారం చేయాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వ్యాపారం సరికాదు. ప్లాస్టిక్ వ్యర్థాల దుకాణాలతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పడుతుంది. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటాం.

●రామాంజులరెడ్డి, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

కోదాడ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

కోదాడ, ఫిబ్రవరి 11: కోదాడ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. నూతనంగా ఎన్నికైన కోదాడ పట్టణ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావును సంఘం సభ్యులతో కలిసి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, రాంబాబు, వరప్రసాద్‌రావు, భ్రమరాంబ పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలు పరిష్కరించాలి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 11: రవాణా రంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ లారీ అసోసియేషన్ నాయకులు కోరారు. కోల్‌కతాలో రెండు రోజుల పాటు జరిగే అలిండియా లారీ యజమానుల సమావేశానికి ఆదివారం కోదాడ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర నాయకులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న ఇంధన ధరలు, టోల్‌గేట్ చార్జీలు, గ్రీన్ టాక్స్, ఇన్సూరెన్ ప్రీమియం పెరుగుదల, పోలీస్ చలానాలతో దేశ వ్యాప్తంగా లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రవాణా రంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆవుల రామారావు, కోదాడ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి, దుర్గాప్రసాద్, జగన్నాథరెడ్డి, సాజిద్ ఖాన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

భానుపురి, ఫిబ్రవరి 11 : ఇమాంపేట సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ భువనగిరిలో ఇద్దరు విద్యార్థినుల ఘటనను మరవక ముందే వైష్ణవి మృతి చెందడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడిన విద్యార్థిని గంటల వ్యవధిలోనే అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించాలని, మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అక్కనపల్లి వినయ్, తాళ్ల వినయ్, అఖిల, వనిత, సౌజన్య, గోపి, అజయ్, శ్రీను ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

అర్వపల్లి మోతె, ఫిబ్రవరి 11: అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987నుంచి 1992సంవత్సరాల మధ్య ఆరు నంచి 10వ తరగతి చదివిన విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. తమ బోధించిన గురువులు స్వరాజ్యం, భాగ్యలక్ష్మీ, కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లుకు పాదాభివందనం చేసి సన్మానించారు. కార్యక్రమంలో సూర్యాపేట జడ్పీటీసీ జీడి బిక్షం, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, పగిళ్ల శంకర్, రాంమూర్తి, రాంకోటి, రవీందర్, ఎల్లయ్య, నర్సయ్య, వెంకటేష్, వీరారెడ్డి, సులోచన పాల్గొన్నారు.

● మోతె మండలంలోని నామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1983-84బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అదేవిధంగా సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కడపు రంగయ్య, దశరథరామిరెడ్డి, బీఎల్ఎస్ చారి, పూర్వ విద్యార్థులు సరసాని భీష్మారెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు ఫిబ్రవరి 11: హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో హుజూర్‌నగర్ సీఐగా చలమందరాజు బాధ్యతలు స్వీకరించారు. చలమందరాజు హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు సూర్యాపేటలో సీఐగా పనిచేసిన రామలింగారెడ్డి సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. అదేవిధంగా హుజూర్‌నగర్ ఎస్ఐగా ముత్తయ్య బాధ్యతలు స్వీకరించారు. ముత్తయ్య సూర్యాపేట ఎస్బీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. హుజూర్‌నగర్‌లో ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన హరికృష్ణను వీఆర్‌లో ఉంచారు. మఠంపల్లి ఎస్ఐగా ఎం.రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీహెచ్ బాలకృష్ణ జిల్లా కేంద్రానికి బదలీ కావడంతో ఆయన స్థానంలో కోదాడ ఎస్ఐగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. మేళ్లచెర్వు ఎస్ఐగా పరమేష్ బాధ్యతలు స్వీకరించారు. పరమేష్ నేరేడుచర్ల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మేళ్లచెర్వు ఎస్ఐగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన పి. సురేష్‌యాదవ్‌ను వీఆర్‌లో ఉంచారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గరిడేపల్లి, ఫిబ్రవరి 11: మండలంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ కోరారు. ఆదివారం మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాకుబ్ మాట్లాడుతూ మండలంలో తాగు నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. గ్రామంలో ఐదు బోర్లు ఉండగా రెండు బోర్లు మాత్రం పని చేస్తున్నాయని, మూడు బోర్లు వారం రోజులుగా పనిచేయకపోయినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బండ్ల రోశమ్మ, సైదులు, మహేష్, రాంరెడ్డి, వెంకన్న, పద్మ, ప్రమీల, సునిత, రామస్వామి, కుమారి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డలో ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....మామిళ్లగడ్డకు చెందిన నలమాద లింగరాజు తన ఖాళీ స్థలంలో రూ.25వేల విలువైన గడ్డిని నిల్వ చేశాడు. మధ్యాహ్నా సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు లింగరాజు కోరాడు.

బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 11: సూర్యాపేట పట్టణంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బీఆర్ఎస్ నాయకుడు కొండపల్లి దిలీప్‌రెడ్డి, ఆయన సతీమణి భార్య మునిసిపల్ కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను బీఆర్ఎస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఇతర పార్టీల వారితో కుమ్మక్కై బీఆర్ఎస్‌కు నష్టం చేకూర్చే పనులు చేస్తున్నందున పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి వారికి బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు.

బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట: మంత్రి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11: రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో హుజూర్‌నగర్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ గుండా ఫణిరెడ్డి, రామిరెడ్డి తమ అనుచరులతో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేయడానికి వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగ సంఘం డివిజన్ కమిటీ

కోదాడ టౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగ సంఘం కోదాడ డివిజన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నవెంకటేశ్వరరావు, పడిగిరి పుల్లయ్య, సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డివిజన్ అధ్యక్షుడిగా ఎస్‌కే జానీమియా, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి అరుణ, కోశాధికారిగా పావని, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే బందగి, జాయింట్ సెక్రటరీగా రాంబాయమ్మ, నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రోశయ్య, పబ్లిక్ సెక్రటరీగా ఎస్‌ఏ అన్వర్, కార్యాలయ సెక్రటరీగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

'కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి'

తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్, నేరేడుచర్ల, ఫిబ్రవరి 11: కృష్ణానదీ జలాలపై హక్కులను కాపాడుకోవడం కోసం నల్గొండ జిల్లా కేంద్రంలో ఈనెల 13న తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ తిరుమలగిరి మండల నాయకుడు తెడ్డు భాస్కర్, బీఆర్ఎస్ నేరేడుచర్ల మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు కోరారు. ఆదివారం తిరుమలగిరిలో నిర్వహించిన సమావేశంలో గాదరి కిషోర్‌కుమార్, జీవన్‌రెడ్డి, తిరుమలగిరి మండల జాలాల్‌పురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భాస్కర్, నేరేడుచర్లలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడారు. అనంతరం బహిరంగ సభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో చింతకుంట్ల సోమిరెడ్డి, చెన్నబోయిన సైదులు, నారాయణ రెడ్డి, సుదర్శన్, జగతయ్య, గుర్వయ్య, శంకర్, సైదులు, వీరారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సౌరయాగం

అర్వపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులో ఉన్న అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం సౌరయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనార్దన్, గణేష్, బాలమురళీకృష్ణ, గిరిధర్ పాల్గొన్నారు.

మఠంపల్లి వాసికి హరివిల్లు పురస్కారం

మఠంపల్లి, ఫిబ్రవరి 11: రచనలు, నటనతో ప్రతిభ చాటుతున్న మఠంపల్లికి చెందిన కర్ల శ్రీనివాస్ హరివిల్లు గాన కళా పురస్కారం అందుకున్నారు. ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాషా సాంస్కృతి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్‌కు పురస్కారాన్ని మాజీ ఎంపీ సుముద్రాల వేణుగోపాలచారి, ఆలూరి విల్సన్, నటుడు నగేష్ కర్ల అందజేశారు.

'బడ్జెట్‌లో గిరిజనులకు నిధులు తగ్గించిన ప్రభుత్వం'

మఠంపల్లి, ఫిబ్రవరి 11: గిరిజనులకు బడ్జెట్‌లో నిధులను ప్రభుత్వ తగ్గించిందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గిరిజనులకు రూ.15,232 కోట్లు కేటాయించి కేవలం రూ.4వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.13,313 కోట్లు కేటాయించి గతం కంటే రూ.1,919 కోట్లు తగ్గించి గిరిజనులకు అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల్లో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

నేటి నుంచి మందుల పంపిణీ

తుంగతుర్తి, ఫిబ్రవరి 11: నులిపురుగులతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. నులి పురుగుల నిర్మూలన కోసం ప్రభుత్వం ఈనెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మందులను పంపిణీ చేయడానికి సన్నద్ధమైంది. జిల్లాలో ఒకటి నుంచి 19వ సంవత్సరాల లోపు 2,13,215మంది పిల్లలకు మందులను పంపిణీ చేయనుంది. నులిపురుగులు ఉంటే చిన్నారులు పోషకాహార లోపం, రక్తహీనత, అలసటతో ఉంటారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపించి మందకొడిగా ఉంటారు. నులిపురుగులను నియంత్రించడానికి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాళ్లకు చెప్పులు ధరించాలి, బహిరంగ మలవిసర్జన చేయొద్దు. మలవిసర్జన అనంతరం చేతులు శుభ్రంగా కడుక్కోవాలి., శుభ్రమైన వస్తువులను తినాలి, స్వచ్ఛమైన నీటిని తాగాలి, గోళ్లు శుభ్రంగా చిన్నగా ఉండే విధంగా చూసుకోవాలి.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

నులిపురుగుల నిర్మూలన కోసం ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు ప్రతి ఇంటికీ, పాఠశాల, కళాశాలలకు వెళ్లి మందులను పంపిణీ చేస్తాం. ప్రతి ఒక్కరూ మందులను వేసుకుని నులిపురుగులను నిర్మూలించి ఆరోగ్యంగా ఉండేందుకు సహకరించాలి.

● పెండెం వెంకటరమణ, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి

గురవయ్య అందించిన సేవలు ఆదర్శనీయం



గురవయ్య చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 11: సూర్యాపేట, తుంగతుర్తి డివిజన్లలో పార్టీ బలోపేతానికి సీపీఎం నేత ధనియాకుల గురవయ్య అందించిన సేవలు ఆదర్శనీయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. గురవయ్య 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం మండలంలోని నాగులపాటిఅన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూస్వాములకు వ్యతిరేకంగా గురవయ్య పోరాడారని కొనియాడారు. సీపీఎంలో గురవయ్య గ్రామస్థాయి నుంచి సీపీఎం సూర్యాపేట, తుంగతుర్తి ఉమ్మడి డివిజన్ల ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ఈ రెండు డివిజన్లలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లను అధిక స్థానాలు గెలిపించుకోవడం జరిగిందన్నారు. బ్యాంకు డైరెక్టర్‌గా గురవయ్య గెలుపొందడమే కాకుండా, ఆయన భార్య లక్ష్మమ్మను ఉమ్మడి నాగులపాటి అన్నారం సర్పంచ్‌గా గెలపించుకున్న ఘనత ఆయనకు ఉందన్నారు. గురువయ్య ఉంటే మనుగడ సాధించలేమని ప్రత్యర్థులైన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని 1999 ఫిబ్రవరి 11న హత్య చేయడం అమానుషమన్నారు. అనంతరం గురువయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగి కృష్ణ, సీనియర్ జర్నలిస్టు ధనియాకుల వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, సీపీఎం గ్రామ కార్యదర్శి అయితబోయిన సత్యనారాయణ గౌడ్, సీపీఎం నాయకులు ముదిగొండ వీరస్వామి, శౌర్యాల జానయ్య, మీసాల లచ్చయ్య, ధనియాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాసవీమాత దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

కోదాడ టౌన్, ఫిబ్రవరి11: వాసవీ మాత కరుణ, కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు వంగవీటి నాగరాజు అన్నారు. వాసవీమాత ఆత్మార్పణ సందర్భంగా కోదాడలోని రామాలయంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. ఆలయంలో నిర్వహించిన పూజల్లో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం దేవరశెట్టి బ్రహ్మయ్య, లక్ష్మీప్రవీణాల సహకారంతో ఏర్పాటుచేసిన ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తలూరి భాస్కర్‌రావు, వెంపటి ప్రసాద్, చల్లాల లక్ష్మీనరసయ్య, లోకేశ్వరరావు, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, గుడుగంట్ల సాయి, గరిడేపల్లి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు

మఠంపల్లి: మఠంపల్లిలో ఆర్యవైశ్యుల మండల సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల సంఘం నాయకులు, యూత్ సభ్యులు, మహిళ వాసవి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నేరేడుచర్ల వాసవీ వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐపీసీ అరుణకుమారి, డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ రాచకొండ శ్రీను, జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, వనితా క్లబ్ జోన్ చైర్మన్ వీరవెల్లి శ్రీలత, సభ్యులు సత్యనారాయణ, గోపాలకృష్ణ, నటరాజు, పరమేశం, పుల్లయ్య పాల్గొన్నారు.



నేరేడుచర్ల శివాలయంలో పూజల్లో పాల్గొన్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

ఒలింపిక్స్ పోటీల్లో కబడ్డీకి ఆదరణ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11: ఒలింపిక్స్ క్రీడల్లో కబడ్డీకి ఆదరణ లభించబోతుందని ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, బెంగుళూరు) అధికారి పిన్నాని సందీప్‌భాగా అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అండర్-16 బాలబాలికల కబడ్డీ సెలెక్షన్స్ పోటీలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆటలతో పాటు చదువు కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా ప్రొ కబడ్డీ క్రీడాకారుడు రాహుల్‌చౌదరితో మాట్లాడి విద్యార్థులకు ఆయన సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, కార్యదర్శి నామా నాగేశ్వరరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, శ్రీనివాస్‌గౌడ్, సంపత్‌రెడ్డి, శంభయ్య, కోటేశ్వరరావు, దళపతి సంపత్‌వర్మ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆత్మకూర్(ఎస్), గరిడేపల్లి, తిరుమలగిరి రూరల్, ఫిబ్రవరి 11: ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పీవైఎల్) జిల్లా నాయకుడు నల్గొండ నాగయ్య కోరారు. ఆదివారం మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు కోరారు. మండలంలోని గ్రామాల్లో వారు మాట్లాడారు.

● సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో వాల్‌పోస్టర్‌ను ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు నవీన్ ఆవిష్కరించారు. కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్ అన్నారు.తిరుమలగిరి మండలంలోని మామిడాల గ్రామంలో ఆయన మాట్లాడారు.



సూర్యాపేట(కలెక్టరేట్): సినీ హీరో చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషదాయకమని అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ భైరు వెంకన్నగౌడ్ అన్నారు. చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా హైదాబాద్‌లో అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని అమరవరం లిఫ్ట్‌ను కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొండపాటి ఆదిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సింగతల వెంకటరెడ్డి, కర్నాటి వీరనాగిరెడ్డి, ఉస్తెల గుర్వారెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: భువనగిరిలో ఇద్దరు విద్యార్థినులు, సూర్యాపేటలో విద్యార్థిని మృతికి నిరసనగా స్వేరోస్ ఆధ్వర్యంలో కోదాడ మండలంలోని కాపుగల్లు గ్రామంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కిరణ్ బాలకృష్ణ, సాయి, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఈ నెల 15వ తేదీని సెలవుగా ప్రకటించడం హర్షనీయమని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు తేజావత్ సైదులునాయక్, రవినాయక్ అన్నారు. పట్టణంలోని ఇందిర సెంటరులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో లకావత్ సైదులు, భాస్కర్, వెంకటేశ్వర్లు, పద్మాబాయి, శివ పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడిగా పల్లె క్రాంతికుమార్‌ను నియమించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో క్రాంతికుమార్‌కు నియామక పత్రాన్ని ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు యరగాని నాగన్న అందజేశారు. కార్యక్రమంలో ముక్కంటి, రాము, రవి పాల్గొన్నారు.

● రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారని టీపీసీసీ సహాయ కార్యదర్శి ఎండీ అజీజ్‌పాషా అన్నారు. హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్బరాజు, మట్టయ్య, సైదులు, వెంకటనారాయణ, సైదులు, రాములు, వెంకటేశ్వర్లు, వెంకట్, పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని తాళ్లమల్కాపురం మాజీ సర్పంచ్ బాణోత్ వెంకటేశ్వర్లు కుమార్తె జాహ్నవి పుట్టినరోజు సందర్భంగా జీప్పీ అనాథాశ్రమంలో పిల్లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దగ్గుపాటి బాబూరావు, దస్‌పాల్, చిన్నీ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: రిటైర్డు ఉద్యోగి, సంఘ సేవకుడు రేపూరి యాకోబ్ విలువలు పాటించారని మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు, ఐఆర్ఎస్ సందీప్‌భాగా, స్పందన సామాజిక అధ్యయన వేదిక ప్రతినిధి కాకి పరాబ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నిర్వహించిన యాకోబ్ సంస్మరణ సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సాముల శివారెడ్డి, దుర్గాప్రసాద్, శాంతి, పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. .

మేళ్లచెర్వు: మండల కేంద్రంలో ఐడియల్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో సముద్రాల వేణువర్ధన్, కరస్పాండెంట్ ఎస్వీ రమణకుమార్, స్వామినాథ్, ప్రిన్సిపాల్ వెంకట్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని తమ్మర గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ పోరెడ్డి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంగవీటి శ్రీనివాసరావు, పగిడి రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నడిగూడెం: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని మానసిక వికాస నిపుణుడు, విజయ్ భవ ట్రస్టు చైర్మన్ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌వో వెంకటరమణ, ఏఎస్ఐ జగన్నాథం పాల్గొన్నారు

● కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల యోజన మహిళలకు వరమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకుల నాగరాజు అన్నారు ఈ పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ సిలిండర్లను నడిగూడెం మండలంలోని చెన్నకేశవపురంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. .

● నడిగూడెం గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ కేంద్రంలో 480 విద్యార్థులకు 460మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డీవో అప్పారావు, అనురాధ పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ బుచ్చిపాపయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, శ్రీను, జైపాల్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్వపల్లి: జనగాంలోని సన్‌మారియ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన జోనల్ లెవల్ పోటీల్లో అర్వపల్లి విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. సీనియర్ లెవల్‌లో నోముల మధుశ్రీ ప్రథమ బహుమతి, జూనియర్ లెవల్‌లో మేఘన ద్వితీయ బహుమతి గెలుచుకుంది.

మద్దిరాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మండలంలోని పోలుమళ్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకన్న, రేణుక పాల్గొన్నారు.